


ఎయిర్‌పోర్టులో స్థల పరిశీలన చేసిన ఆర్డీవో

భోగాపురం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): భోగాపురం మండలంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో హెచ్‌పీసీఎల్‌కు కేటాయించిన స్థలాన్ని ఆర్డీవో డి.కీర్తి బుధవారం పరిశీలించారు. ఎయిర్‌పోర్టులో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు సుమారు 7.5 ఎకరాలు కేటాయించారు. ఆ స్థలానికి సంబంధించి హెచ్‌పీసీఎల్‌వారికి ఎన్‌వోసీ ఇచ్చేందుకు ఆమె తొలుత స్థల పరిశీలన చేశారు. వివరాలపై ఆరా తీశారు. ఆమె వెంట తహసీల్దార్ ఎం.సురేష్, జీఎంఆర్ ప్రతినిధులు ఉన్నారు.

మనకు తెలియకుండా మోసపోతున్నాం

- జిల్లాలో తాజాగా భారీ సైబర్ నేరం వెలుగులోకి వచ్చింది. ఓ రిటైర్డ్ అధ్యాపకురాలిని బెదిరించి రూ.40 లక్షలు కాజేసేందుకు ప్రయత్నించారు. మీరు పంపిన పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని..తాము పోలీసులమని చెప్పి ఆమె ఖాతాలో ఉన్న రూ.40 లక్షలు వేరే ఖాతాకు మళ్లించుకున్నారు. మోసమని బాధితురాలు గుర్తించిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబర్ క్రైం పోలీసులు రంగంలోకి దిగి రూ.20 లక్షలను ఫ్రీజింగ్ చేయగలిగారు. అనంతరం అకౌంట్ వివరాల ఆధారంగా నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు.
- పీఎం కిసాన్‌సమ్మాన్ పథకానికి సంబంధించి స్టేటస్ తెలుసుకునే క్రమంలో నకిలీ యాప్ ఒకటి ప్రత్యక్షమవుతోంది. ఆ యాప్ తెరిస్తే ఖాతా నుంచి డబ్బులు మాయమవుతున్నాయి. ప్రధానంగా హ్యాకింగ్‌కు గురైన నంబర్ల నుంచే యాప్ వస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ మోసం ఎక్కడికక్కడే వెలుగులోకి వచ్చింది.
- విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఉపాధ్యాయుడు ఫోన్‌కు క్రెడిట్ కార్డుకి సంబంధించిన మెసేజ్ వచ్చింది. ఆన్‌లైన్ ద్వారా బిజినెస్ చేస్తే మంచి లాభాలు ఉంటాయని మెసేజ్ సారాంశం. దీంతో లింక్ క్లిక్ చేశారు. వెంటనే తన ఖాతాలోంచి రూ.40 వేలు పోయాయి. లబోదిబోమంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.





సైబర్ నేరాలు పెరుగుతుండడం అందరిలో ఆందోళన కలిగిస్తోంది. ప్రతిరోజూ ఏదో చోట నేరాలు వెలుగు చూస్తున్నాయి. ఏమాత్రం అవకాశం దొరికినా బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. అనేక రకాలుగా ప్రయత్నించి మోసం చేస్తున్నారు. ఇందులో సామాన్యులే ఎక్కువగా బాధితులుగా మిగులుతున్నారు. స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరగడంతో దీనిని ఆసరాగా చేసుకొని నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఆన్‌లైన్ లింకులు పంపడం ద్వారా గాలం విసురుతున్నారు. యువతను ట్రాప్ చేస్తే వారు తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి అయినా డబ్బులు ఇస్తారని అడ్డంగా మోసగిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు యువకులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు.

- భయపెడుతున్న సైబర్ నేరాలు
- రకరకాల మార్గాల్లో వెలుగు చూస్తున్న ఘటనలు
- ఫేస్‌బుక్ ఖాతాలు హ్యాక్
- స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అప్రమత్తం

విజయనగరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో చాలామంది ఫేస్‌బుక్ ఖాతాలు హ్యాక్ అవుతున్నాయి. కొందరే గుర్తించగలుగుతున్నారు. 'మిత్రులారా నా ఫేస్‌బుక్ హ్యాక్ అయ్యింది. నా పేరిట ఎవరో నగదు అడుగుతున్నారు. దయచేసి ఎవరూ నగదు పంపించకండి' అంటూ వాట్సాప్ గ్రూపులు, స్టేటస్‌లో పెట్టుకోవాల్సి రావడం నిత్యకృత్యమైంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న వేళ కొందరు సైబర్ నేరగాళ్లు సరికొత్తగా సవాల్ విసురుతున్నారు. వారు వీరూ అన్న తేడా లేదు. పోలీస్ అధికారులు మొదలు వ్యాపారులు, ఉద్యోగులు, అన్నివర్గాల ప్రజలపై గురిపెడుతున్నారు. సోషల్ మీడియాలో నిత్యం ఏదో ఒక పోస్టు పెడుతుండే వారి ఖాతాలను అంతగా హ్యాక్ చేయడం లేదు. యాక్టివ్ లేని వారిపైనే గురిపెడుతున్నారు. చాలామంది నిత్యం వారు స్నేహితులకు ఫేస్‌బుక్ ద్వారా అందుబాటులో ఉంటారు. అంతేకాదు వారు తమ ప్రొఫైల్ ఫొటో, ఇతర సమాచారం మారుస్తూ ఉంటారు. తాము పోస్టు చేసే సందేశాలను వారి స్నేహితులకు షేర్ చేస్తూ ఉంటారు. అదే యాక్టివ్‌గా లేనివారు ఎప్పుడో ఒక ఫొటో పెట్టి వదిలేస్తుంటారు. వారి అకౌంట్‌ను హ్యాక్‌చేసినా వారు చూసేసరికి చాలా సమయం పడుతుంది. అందుకే ఇటువంటి వారి ఖాతాలనే సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తున్నట్టు తెలుస్తోంది. స్నేహితులకు నగదు అడగడం, వారు వెనువెంటనే అకౌంట్‌లో జమచేయడం, తరువాత బాధితుడికి తెలిసినా ఏం చేయలేని నిస్సహాయ స్థితిలోకి వెళ్లడం ఇటీవల పరిపాటిగా మారింది. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది.

ఫేక్ అకౌంట్స్..

మరోవైపు అకౌంట్‌లు హ్యాక్ చేయడంతో పాటు ఆయా వ్యక్తుల ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతాలను సైతం తయారు చేస్తున్నారు. ముందుగా ఫేస్‌బుక్‌లో ఖాతాలను ఎంచుకుంటున్నారు. ఆ ఖాతాలో ప్రొఫైల్ ఫొటో పేరుతో కొత్త అకౌంట్ తెరుస్తున్నారు. ఆ ఖాతా నుంచి అసలు వ్యక్తి ఖాతాలో ఉన్న స్నేహితులకు ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతున్నారు. అలా పదుల సంఖ్యలో స్నేహితులు చేరిన తరువాత తమ పని మొదలు పెడుతున్నారు. సదరు నకిలీ ఖాతా మెసెంజర్ ద్వారా చాట్‌చేసి నగదు అడుగుతున్నారు. అవతలి వ్యక్తి నమ్మకం బట్టి కొందరు వెనువెంటనే నగదు అకౌంట్‌లో వేస్తుండగా..మరికొందరు మోసమని గ్రహించి వెనువెంటనే బాధితుడికి విషయం చేరవేస్తున్నారు. కానీ అప్పటికే వేలాది రూపాయలు చేతులు మారుతున్నాయి.

వీటి జోలికి పోవద్దు..

మీ కేవైసీ అప్‌డేట్ చేయాలని ఫలానా యాప్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని లింక్ వస్తే అస్సలు క్లిక్ చేయకూడదు. ఇలా క్లిక్ చేసిన నిమిషాల వ్యవధిలోనే మీ బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుంది. ఆన్‌లైన్‌లో వెంటనే అప్పులిస్తామన్న యాప్‌లకు దూరంగా ఉండండి. ఒక వేళ రుణం తీసుకున్నా.. తరువాత సమస్యలు వెంటాడే అవకాశం ఉంది. మీకు లాటరీ వచ్చింది. కొంత మొత్తం నగదు చెల్లించాలంటే అస్సలు నమ్మకండి. మైక్రోఫైనాన్స్, ఆన్‌లైన్ రుణ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోకండి. ఆన్‌లైన్ వస్తువుల కొనుగోలు సమయంలో నమ్మకమైన యాప్‌లనే ఆశ్రయించండి.

సైబర్ నేరాలపై అప్రమత్తం..

ప్రతీ మెసేజ్ క్షుణ్ణంగా చదవాలి. అవతలి వ్యక్తి సమాచారాన్ని పూర్తిగా తెలుసుకొని స్పందించాలి. ఇటీవల సైబర్ నేరాలు పెరుగుతుండడం ఆందోళన కలిగించే విషయం. ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. కానీ మోసాలు పెరుగుతున్నాయి. నియంత్రించడానికి పోలీస్ శాఖ చర్యలు చేపడుతోంది. ఎటువంటి సైబర్ నేరానికి గురైనా స్థానిక పోలీస్ స్టేషన్‌ల్లో లేదా..1930 సైబర్ క్రైం పోర్టల్లో ఫిర్యాదు చెయ్యాలని ప్రజలకు సూచిస్తున్నాం.

-వకుల్‌జిందాల్, ఎస్పీ, విజయనగరం

2023-24 సంవత్సరంలో సైబర్ నేరాలు ఇలా..

- ఆన్‌లైన్ మోసాలు: 49
- ఉద్యోగాల పేరుతో జరిగిన మోసాలు: 7
- వాట్సాప్, ఈ మెయిల్, సామజిక మాధ్యమాల ద్వారా జరిగిన వేధింపుల ఘటనలు: 22
- ఏటీఎం/క్రెడిట్ కార్డు మోసాలు: 11
- ఓటీపీ మోసాలు: 5





అందరికీ తాగునీరు

జిల్లా ప్రజలకు ఇకపై తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కొత్త ప్రణాళిక తయారవుతోంది. అందుకు వినూత్న ఆలోచనతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జలజీవన్ మిషన్ కింద వేసిన కొళాయిలకు వివిధ సాగునీటి ప్రాజెక్టుల నుంచి నీరు సరఫరా చేసేందుకు యంత్రాంగం కార్యాచరణ తయారు చేస్తోంది. దాదాపు రూ.1700 కోట్లతో ప్రణాళిక సిద్ధం అవుతోంది. దీనిపై జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు.

- జలజీవన్ మిషన్‌కు ప్రాజెక్టుల ద్వారా నీటి సరఫరా
- దాదాపు రూ.1700 కోట్లతో ప్రణాళిక
- ప్రభుత్వానికి నివేదించనున్న జిల్లా అధికారులు

గంట్యాడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):

జలజీవన్ మిషన్ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నిధులు పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడం వల్ల పనులు చేసేందుకు కొందరు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఈ విధంగా జిల్లా వ్యాప్తంగా రూ.902 కోట్లతో 2703 పనులు మంజూరు చేయగా వాటిలో 1052 పూర్తి చేశారు. రూ.118.8 కోట్లు విడుదల చేసింది. ఇంకా రూ.60 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా గతంలో రక్షిత పథకాల నుంచి జలజీవన్ మిషన్ పథకం కొళాయిలకు నీరు సరఫరా చేసేవారు. దీనివల్ల పూర్తిస్థాయిలో ఇంటింటికీ తాగునీరు అందే పరిస్థితి లేకపోయింది. ప్రజలు ఇబ్బంది పడేవారు. కూటమి ప్రభుత్వం జలజీవన్ మిషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది. వారం రోజుల క్రితం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జలజీవన్ మిషన్‌కు అదనంగా నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన సంగతి తెలిసిందే. జలజీవన్ మిషన్‌కు తాగునీటి పథకం నుంచి కాకుండా ప్రాజెక్టుల ద్వారా నీరు అందించేందుకు జిల్లా అధికారులు కార్యాచరణ తయారు చేశారు.

జిల్లాలోని 1621 గ్రామాల్లో ప్రతి ఇంటికీ తాగునీరు ఇస్తే ఏడాదికి 2.138 టీఎంసీలు అవసరం పడుతుం దని అధికారులు అంచనా వేశారు. ఆ మేరకు ప్రాజెక్టుల ద్వారా సంబంధిత నియోజకవర్గాల్లో ఉన్న మండలాలకు నీరు అందించనున్నారు. సుమారు రూ.1700 కోట్ల నిధులు అవసరం పడుతుందని ఒక ప్రణాళిక తయారు చేశారు. ఆ ప్రకారం నెల్లిమర్ల, చీపురుపల్లి నియోజకవర్గాల పరిధిలో ఉన్న భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ, గుర్ల, నెల్లిమర్ల మండలాల్లో ఉన్న 375 గ్రామాలకు 0.395 టిఎంసిల నీరు అవసరం కానుంది. దీనికి చంపావతి నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న కుమిలి రిజర్వాయర్ నుంచి తాగునీరు సరఫరా చేయనున్నారు.



- బొబ్బిలి నియోజకవర్గం పరిధిలో ఉన్న బాడంగి, రామభద్ర పురం మండలాల్లో ఉన్న 58 గ్రామాలకు 0.125టిఎంసిల నీరు అవసరం కానుంది. దీనికి వేగావతి నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న పెదగెడ్డ రిజర్వాయర్ నుంచి నీరు అందించేందుకు ప్రణాళిక తయారు చేశారు.
- సువర్ణముఖి నదీ పరివాహక ప్రాంతంలోని వెంగళరాయిసాగర్ పరిధిలో బొబ్బిలి మండల పరిధిలో ఉన్న 58 గ్రామాలకు 0.008 టిఎంసీ నీరు అవసరం పడుతుంది. చంపావతి నది పరిధిలోని ఆంధ్ర రిజర్వాయర్ నుంచి మెంటాడ, దత్తిరాజేరు, గజపతినగరం మండలాల్లో ఉన్న 182 గ్రామాలకు 0.199 టిఎంసి నీరు అవసరం పడుతుందని కార్యాచరణ తయారు చేశారు.
- గోస్తనీ నదీ పరివాహక ప్రాంతంలోని తాటిపూడి రిజర్వాయర్ నుంచి గంట్యాడ, బొండపల్లి, విజయనగరం, ఎల్.కోట, ఎస్.కోట, వేపాడ, కొత్తవలస, జామి మండలాల్లో ఉన్న 468 గ్రామాలకు 0.683 టిఎంసి నీరు అవసరం పడుతుంది.
- నాగావళి నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న మడ్డువలస రిజర్వాయర్ నుంచి వంగర, రేగడి, సంతకవిటి, తెర్లాం, రాజాం, మెరకముడిదాం, గరివిడి, చీపురుపల్లి మండలాల్లో ఉన్న 445 గ్రామాలకు 0.652 టిఎంసీల నీరు అవసరం పడుతుందని కార్యాచరణ తయారు చేశారు.

భోజనంలో పురుగులు

- చీపురుపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో ఘటన
- ప్రశ్నించిన తల్లిదండ్రులతో నిర్వాహకుల వాగ్వాదం



అన్నాన్ని పారబోస్తున్న విద్యార్థులు

చీపురుపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనంలో పురుగులు దర్శనమిచ్చాయి. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల బుధవారం ఈ ఘటన జరిగింది. ఇదేమిటని ప్రశ్నించిన విద్యార్థుల తలిదండ్రులతో నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పాటు ఘర్షనకు దిగినట్టు తల్లిదండ్రులు ఆరోపించారు. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

పాఠశాల హెచ్‌ఎం రహీనాబేగం ఎప్పటిలాగే విద్యార్థులకు సరిపడా బియ్యాన్ని నిర్వాహకులకు బుధవారం అందజేశారు. అనంతరం ఆమె పాఠశాల సముదాయల చైర్మన్ హోదాలో పైలపేట పాఠశాల సందర్శనకు వెళ్లారు. నిర్వాహకులు యథావిధిగా అన్నం వండి భోజనం సమయంలో పిల్లలకు వడ్డించారు. అన్నం తినేందుకు సిద్ధమైన విద్యార్థులు అన్నంలో పురుగులు ఉండడాన్ని గమనించి ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేశారు. అదే సమయంలో ఓ విద్యార్థి తండ్రి పాఠశాలకు రావడంతో జరిగిన సంఘటన ఆయన దృష్టిలో పడింది. దీంతో అన్నంలో పురుగు లేంటని ఆయన నిర్వాహకుల్ని ప్రశ్నించారు. నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పాటు తనతో ఘర్షణకు దిగారని ఆయన ఆరోపించారు. సమాచారం తెలుసు కున్న హెచ్‌ఎం తక్షణమే పాఠశాలకు చేరు కొని, వివాదాన్ని సద్దుమణిగించారు. తిరిగి అన్నం వండించి విద్యార్థులకు పెట్టారు.

- ఘటనపై పాఠశాల హెచ్‌ఎం రహీనా బేగం మాట్లాడుతూ, బుధవారం ఉదయం విద్యార్థుల హాజరు మేరకు నిర్వాహకులకు బియ్యం ఇచ్చానన్నారు. తమ వద్ద ఉన్న బియ్యం బస్తాలను తనిఖీ చేశామని, ఒక్క బస్తాలోకి పురుగులు ఎలావచ్చాయో తెలియదన్నారు. అప్రమత్తంగా ఉండాల్సిందిగా నిర్వాహకుల్ని ఆదేశించామన్నారు.

లాకౌట్ ఎత్తేస్తాం

- జనవరిలోగా పరిష్కరిస్తాం
- జేసీఎల్‌కు హామీ ఇచ్చిన ఉమా జూట్‌మిల్ యాజమాన్యం



విశాఖలో చర్చల్లో పాల్గొన్న యాజమాన్య, కార్మిక సంఘం ప్రతినిధులు

కొత్తవలస, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుమ్మికాపల్లి పంచాయతీ పరిధిలోని ఉమా జూట్ మిల్లులో విధించిన లాకౌట్‌ను వచ్చే జనవరిలోగా ఎత్తి వేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు యాజమాన్యం తెలిపింది. దీంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జూలై నుంచి యాజమాన్యం లాకౌట్ విధించడంతో అప్పటి నుంచి కార్మికులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే డీసీఎల్, జేసీఎల్ వద్ద పలుమార్లు చర్చలు నిర్వహించినా యాజమాన్య ప్రతినిధులు హాజరుకాలేదు. కొద్ది రోజుల కిందట జరిగిన చర్చల్లో నెల రోజులు గడువు ఇస్తే కార్మికులతో చర్చించి సమస్యను పరిష్కరించుకుంటామని యాజమాన్యం జేసీఎల్ అధికారి సునీతను కోరింది. ఈ మేరకు మంగళవారం విశాఖలో జేసీఎల్ వద్ద జరిగిన చర్చలకు యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘానికి చెందిన నాయకులు హాజరయ్యారు. లాకౌట్ సమస్యతో పాటు అన్ని సమస్యలను జనవరిలోగా పరిష్కరించుకుంటామని యాజమాన్య ప్రతినిధులు జేసీఎల్‌కు హామీ ఇచ్చారు. యాజమాన్యం లాకౌట్ ఎత్తి వేసేవరకు తమ పోరాటం కొనసాగుతుందని కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గణేష్ పండా స్పష్టం చేశారు. చర్చలలో మంచి వాతావరణంలోనే జరిగినందున ఆశాభావంతో ఉన్నట్టు తెలిపారు. చర్చల్లో యాజమాన్య ప్రతినిధులు టి.సుబ్బారావు, టి.సప్తగిరి హాజరుకాగా కార్మిక సంఘం తరపున గణేష్ పండా, కర్రు శ్రీను, కె.ఈశ్వరరావు, ఎస్.గోవింద, ఎస్.రాంబాబు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను మొక్కుబడిగా పరిష్కరించొద్దు

ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలి: కలెక్టర్

విజయనగరం, కలెక్టరేట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకూ జరగనున్న రెవెన్యూ సదస్సులు మొక్కుబడిగా కాకుండా సమస్యల పరిష్కారం దిశగా నిర్వహించాలని కలెక్టరు అంబేడ్కర్ ఆదేశించారు. రెవెన్యూ డివిజినల్ అధికారులు, తహసీల్దార్లతో బుధవారం సాయంత్రం ఆయన సమావేశం నిర్వహించారు. సదస్సుల్లో వచ్చే వినతులను ప్రజలు మధ్యే పరిష్కరించాలని, వాస్తవాలను గ్రామ సభల్లో వివరించాలని సూచించారు. పిజిఆర్ఎస్‌లో ఎక్కువగా రెవెన్యూ సమస్యలే వస్తున్నాయని, ఈ సదస్సుల తర్వాత రెవెన్యూ అంశాలపై ఎటువంటి వినతులు రాకూడదని తెలిపారు. ప్రతి దరఖాస్తుకు సరైన సమాధానాన్ని రాయాలని, కోర్టు కేసుల విషయంలో కూడా స్పష్టంగా విచారించి రిపోర్టు రాయాలని చెప్పారు. ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గానికీ ఒక డిప్యూటీ కలెక్టర్‌ను ఇన్‌చార్జిగా నియమించామన్నారు. ఫ్రీహోల్డ్ భూముల రికార్డులన్నీ స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని, పిడిఎఫ్‌లో సంబంధిత తహసీల్దార్ల నుంచి కలెక్టరేట్‌కు రావాలని తెలిపారు.

ఏ రోజుకారోజు ఆన్‌లైన్ చేయాలి

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ఏ రోజుకారోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టరు ఆదేశించారు. జిల్లాలోని 502 గ్రామాల్లో రీసర్వే పూర్తి అయ్యిందని, ఆ గ్రామాల్లో రీసర్వే సమస్యలపై సుమారు 24,560 దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. వీటిల్లో 10,500 దరఖాస్తులు రీసర్వేకు సంబధించినవి కాగా 13,200 వరకూ రెవెన్యూ సమస్యలపై వచ్చాయని చెప్పారు. నెల్లిమర్ల ఎంఎల్ఏ లోకం మాధవి మాట్లాడుతూ సదస్సుల్లో ఎటువంటి ఒత్తిళ్లకు గురికాకుండా పేదలకు న్యాయం చేయాలని కోరారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయ భూసేకణలో అవకతవకలు జరిగాయని, సుమారు 152 మంది హక్కుదారులకు నేటికీ పరిహారం అందలేదన్నారు. సమావేశంలో జేసీ సేతుమాధవన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి తదితరులు ఉన్నారు.



అలరించిన స్వరాభిషేకం

- 12 గంటల పాటు నిర్విరామంగా గీతాలాపన
- ఘనంగా ఘంటసాల జయంతి



6లో

ఆరోగ్యమే మహా ప్రసాదం



6లో



సందడి చేసిన హీరో కిరణ్

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో కిరణ్ అబ్బవరం విజయనగరంలో బుధవారం సందడి చేశారు. నగరంలోని డాబాతోట వద్ద ఓ షాపింగ్ మాల్ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై అందరినీ ఆకట్టుకున్నారు. ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు యువత పోటీ పడ్డారు.

రైలు ప్రయాణాల్లో
నిబంధనలు పాటించాల్సిందే!

● అయ్యప్ప, శివ, భవానీ మాలధారులకు రైల్వేశాఖ కీలక సూచనలు
● అగ్ని ప్రమాదాల నివారణకు సహకరించాలని విన్నపం ● పాటించకుంటే జైలు శిక్షే



పాలకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప శివ, భవానీ మాలధారులకు దక్షిణ మధ్య రైల్వేశాఖ కీలక సూచనలు చేసింది. రైలు ప్రయాణాల్లో నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. అగ్ని ప్రమాదాల నివారణకు అంతా సహకరించాలని కోరింది. భక్తుల మనోభావాలను గుర్తిస్తున్నామని, అయితే అగ్ని ప్రమాదాల నివారణలో భాగంగానే భక్తులకు పలు సూచనలు చేస్తున్నట్టు తెలిసింది. జిల్లా నుంచి ప్రతి ఏటా నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో శబరిమలైకు వేలాది మంది అయ్యప్ప భక్తులు రైళ్లలోనే రాకపోకలు సాగిస్తుంటారు. రెండు మూడు రోజులు వారు రైళ్లలోనే ఉంటారు. అదే విధంగా జిల్లా లోని వేలాది మంది శివస్వాములు శ్రీశైలం, అరుణాచలం వంటి పుణ్య క్షేత్రాలకు వెళ్లి మొక్కులు తీర్చుకుంటారు. అలాగే, భవానీ భక్తులు అధిక సంఖ్యలో విజయవాడ కనక దుర్గమ్మను దర్శించుకునేందుకు రైలులో ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో ఇరుముడులకు కర్పూరం, హారతి ఇవ్వడం, అగరబత్తి వెలిగించడం వంటివి చేస్తున్నారు. వీటి కారణంగా అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని రైల్వే అధికారులు హెచ్చరిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి రైలులో కర్పూరం వెలిగించడం, హారతి ఇవ్వడం చేస్తే సెక్షన్ 67, 154, 164, 165 ప్రకారం మూడేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధిస్తామని హెచ్చరిస్తోంది. ఈ విషయంలో అయ్యప్ప, శివ, భవానీ భక్తులు అలర్ట్‌గా ఉండి రైల్వే నిబంధనలు పాటించాలని రైల్వేశాఖ కోరుతుంది.

ముందస్తు జాగ్రత్తలో భాగంగానే..

ముందస్తు జాగ్రత్తలో భాగంగానే అగ్ని ప్రమాదాల నివారణకు కోచ్‌ల్లో కర్పూరం వెలిగించడం, హారతి ఇవ్వడం వంటివి చేయవద్దని రైల్వేశాఖ చెబుతుంది. భక్తుల మనోభావాలను పరిగణలోకి తీసుకుంటాం. సున్నితమైన ఈ విషయంలో భక్తులంతా సహకరించాలి.

-దుర్గారావు, రైల్వే డీఆర్‌సీ మెంబర్

ఆరోగ్యమే మహా ప్రసాదం

● ప్రసాదాల్లో ఎన్నో పోషకాలు

రాజాం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పండగ రోజుల్లో సంప్రదాయ వంటకాలకే ప్రాధాన్యం ఇస్తుంటాం. స్వామికి నివేదించే ప్రసాదాల్లో ఆచార, సంప్రదాయ పదార్థాలకు పెద్దపీట వేస్తాం. కాలానుగుణంగా పెళ్లి, పేరంటాల్లో ఆధునిక వంటకాలకు ప్రాధాన్యత పెరుగుతున్నా.. ప్రసాదాల విషయంలో ఆధునికతకు పెద్దగా స్థానం కల్పించలేదు. పాతపద్ధతులనే వాడడం విశేషం. శ్రావణ, ఆశ్వయుజ, కార్తీక, ధనుర్మాసాల్లో వినియోగించే వంటకాల్లో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. తీర్థ ప్రసాదాల వల్ల మానసిక శాంతి, శారీరక ఆరోగ్యం లభిస్తాయని వేద పండితులు, ఆయుర్వేద వైద్యులు సూచిస్తున్నారు. ఒక్కో పర్వదినానికి ఒక్కోరకం ప్రసాదం సమర్పించడం పూర్వీకుల నుంచి ఆనవాయితీగా వస్తోంది.

ఏ స్వామికి ఏ ప్రసాదం..

● వినాయకుడికి ఉండ్రాళ్లు, పూర్ణాలు, తీపి కుడుములు, నైవేద్యంగా పెడతారు. ● సుబ్రమణ్యస్వామికి పాల పాయసం. ● శివునికి దద్దోజనం. ● అంజనేయుడికి అప్పాలు. ● సత్యన్నారాయణస్వామికి గోధుమనూక ప్రసాదం. ● సాయిబాబాకు రొట్టె, బెల్లం, సంగటి, పాలు, పాయసం. ● వేంకటేశ్వరస్వామికి కదంబం, చిత్రాన్నాలు, లడ్డూ. ● శ్రీకృష్ణుడికి వెన్న మురుకులు. ● శ్రీరాముడికి పానకం. ● అయ్యప్పస్వామికి కాజాలు, ఖర్జూరం, హల్వా. ● అమ్మవార్లకు వడలు, బూరెలు, చిత్రాన్నం. ● సరస్వతీదేవికి బొబ్బట్లు, పూర్ణాలు. ● శ్రీమహాలక్ష్మికి కొబ్బరి బూరెలను నైవేద్యంగా పెడతారు. ప్రతి ప్రసాదానికి విశిష్టత ఉంది. ప్రసాదాల తయారీలో వాడే మిశ్రమాలు ఆరోగ్యానికి చేసే మేలు ఇంతా అంతా కాదు.

తీర్థం... దివ్య ఔషధం



ఆలయాలలో ఇచ్చే తీర్థంలో యాలకులు, పచ్చ కర్పూరం, లవంగపొడి, కుంకుమపువ్వు పొడి, తులసి వినియోగిస్తారు. వీటివల్ల మనసుకు ఏకాగ్రత, రోగ నిరోధకశక్తి, జీర్ణశక్తి, శరీరకాంతి మెరుగుపడతాయి. శ్లేష్మాన్ని తగ్గించడం, మేధాశక్తి పెంపొందటం వంటి మంచి ఫలితాలు కలుగుతాయని ప్రతీతి. ఈ చూర్ణాలను నీటిలో కరిగించి ఆ నీటిని సాలిగ్రామ శిలపై ఉంచి అభిషేకించి, ఆ తీర్థంలో తులసిదళాలు వేసి భక్తులకు ఇస్తారు.

మేధస్సును పెంచే దద్దోజనం..



బియ్యం, పెరుగు, ఇంగువ, కొత్తిమీర, అల్లం, మిర్చి, శొంఠిపొడిల మిశ్రమంతో తయారుచేసిన ఈప్రసాదం మేధస్సును పెంచుతుంది. శరీరానికి మంచి శక్తినిచ్చి ఆరోగ్యాన్ని కలిగిస్తుంది.

కొబ్బరిపాల పాయసం..



కొబ్బరి, పాలు, పచ్చకర్పూరం, యాలకులపొడి, బాదంపప్పు, కుంకుమపువ్వు, పంచదార, ఆవుపాలు, కలకండ పొడితో తయారు చేసిన ఈప్రసాదం ఇటు పూజకే కాకుండా ఆరోగ్యప్రధాయని కూడా.

రోగ నిరోధకశక్తిని పెంచే చలిమిడి..




బియ్యంపిండి, బెల్లం, యాలకులు, జీడిపప్పు, ఎండి కొబ్బరితో తయారుచేసిన చలిమిడి మంచి బలవర్ధకం. వెంటనే శక్తినివ్వడమే కాకుండా తేలికగా జీర్ణం అవుతుంది. ఆకలిని పెంచుతుంది. రోగనిరోధకశక్తిని పెంచుతుంది.

తింటే గారిలే తినాలి...



● మినప్పప్పు, అల్లం మర్చి, నెయ్యి మిశ్రమంతో తయారుచేసిన గారెలు ఆకలిని పెంచుతాయి. శరీరానికి ఎంతో శక్తినిస్తాయి.





నోరూరించే చక్కెర పొంగళి..

బియ్యం, పెసరపప్పు, పటికబెల్లం పొడి, బెల్లం, యాలకులు, కిస్‌మిస్, పచ్చకర్పూరం మిశ్రమంతో తయారుచేసిన చక్కెరపొంగళి అత్యంత బలవర్ధకం. మంచి సువాసనతో కూడిన ఈ పదార్థం రోగనిరోధకశక్తిని పెంచుతుంది. శరీరానికి మంచి శక్తినిస్తుంది.

● శనగపప్పు, బెల్లం, యాలకులు, మినప్పప్పు, నెయ్యి బియ్యం మిశ్రమంతో తయారుచేసిన బూరెలు బలవర్ధకం.

● గోధుమరవ్వ, కొబ్బరి, బియ్యంపిండి, బెల్లం, పచ్చిపాలతో చేసిన తీపి కుడుములు చిన్న పిల్లలకు బలవర్ధకం.

● బియ్యపురవ్వ, పచ్చిశనగపప్పు, జీలకర్ర, ఉప్పు, నెయ్యి మిశ్రమంతో తయారుచేసిన ఉండ్రాళ్లు వినాయకునికి ప్రీతిపాత్రం. జీర్ణశక్తిని పెంచుతాయి. ● నానబెట్టిన శనగలు, పచ్చిమిర్చి, ఉప్పు, ఎండుమిర్చి మిశ్రమాన్ని తాలింపు వేసి ప్రసాదంగా పెడుతున్నారు. ఇది శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ● శనగపిండి, నెయ్యి, పంచదార, కిస్‌మిస్, జీడిపప్పు, యాలకుల పొడి, పచ్చకర్పూరం మిశ్రమంతో తయారుచేసిన బూంధీ లడ్డు వెంకన్న ప్రసాదంగా వాడతారు. ఇది ప్రసాదంగానే కాకుండా కఫాన్ని తగ్గిస్తుంది. రోగనిరోధకశక్తిని పెంచుతుంది.

జీర్ణకోశ వ్యాధుల నివారిణి పులిహోర..

బియ్యం, చింతపండు పులుసు, శనగపప్పు, మనప్పప్పు, ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, ఇంగువ, పసుపు, బెల్లం, నూనె, వేరుశనగ పలుకులు, జీడిపప్పుతో పాటు కొద్దిగా నిమ్మరసం వేసి తయారుచేసిన పులిహోర ఎవరికైనా ఇట్టే ఇష్టపడుతుంది. పులిహోర జీర్ణశక్తిని పెంచుతుంది. జీర్ణకోశ వ్యాధులను నివారిస్తుంది.

ప్రసాదాలతో సంపూర్ణ ఆరోగ్యం..



ఆగమ నియమాలను అనుసరించి ఆలయ వ్యవస్థ పని చేస్తుంది. దేవుళ్లెవరూ మాకివి కావాలని అడగరు. మన ఇష్ట కామ్యార్థ సిద్ధి కోసం మనమే సమర్పించుకుంటున్నాం. రోజూ ఒకేలా కాకుండా కాలనుగుణంగా ఆయా దేవతలకు ఆయా పదార్థాలను నైవేద్యాలుగా ఆగమ పండితులు నిర్ణయించారు. స్వామిని కూడా చంటిబిడ్డను చూసినట్టే ప్రేమగా చూస్తాం. తీర్థప్రసాదాలలో వినియోగించేవన్నీ వనమూలికా మిశ్రమాలే. వీటిని స్వీకరించడం వల్ల శాంతగుణం పెరిగి మంచి ప్రవర్తన వస్తుంది.

-ఉపాపతి శేషు గురుస్వామి, రాజాం

అలరించిన స్వరాభిషేకం

● 12 గంటల పాటు నిర్విరామంగా గీతాలాపన
● ఘనంగా ఘంటసాల 102 జయంతి



ఘంటసాల గీతాలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు

విజయనగరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల జయంతి పురస్కరించుకుని చేపట్టిన 12 గంటల నిర్విరామ ఘంటసాల స్వరాభిషేకం సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. నగరంలో ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో కళాపీఠం వ్యవస్థాపకుడు, సంగీత గురువు మద్దుగారు భీష్మారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమం ఆద్యంతం అందరినీ ఉర్రూతలూగించింది. ఘంటసాల చిత్రాల్లోని పాటలను గాయనీగాయకులు తమ గానాలాపనతో కట్టి పడేశారు. సంగీత, సాహిత్య ప్రియులంతా కొన్ని గంటల పాటు సంగీత ప్రపంచంలో ఓలలాడారు. జిల్లా కేంద్రానికి చెందిన పలువురు ఔత్సాహిక గాయనీగాయకులు పాడిన పాటలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. గోరింక గూటికే చేరావే చిలక.. నీలిమేఘాలలో గాలి కెరటాలలో, జగమే మాయ పాటలతో పాటు.. లవకుశ చిత్రం నుంచి చిన్నారులు ఆలపించిన వినుడు..వినుడు రామాయణ గాథ తదితర పాటలు సంగీత ప్రియులను ఓలలాడించాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.ఉమాశంకర్‌తో పాటు పలువురు ఉద్యోగులు పాడిన గీతాలు అలరించాయి. ఓ మహిళా ఘంటపాల ఈలపాట ఆకట్టుకుంది. తొలుత ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నగర వీధుల్లో ఆయన చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం ఆనందగజపతి ఆడిటోరియంలో నిర్వహించిన 12 గంటల నిర్విరామ ఘంటసాల స్వరాభిషేకం ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాపీఠం ప్రతినిధులు నరసింహారాజు (బుచ్చిబాబు), దవళ సర్వేశ్వరావు, మేకా కాశీవిశ్వేశురుడు, గ్రంధి విష్ణుమూర్తి, వై.వి.వి. సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



వయోలిన్ కళాకారిని కామాక్షి

తెలుగు ఇండియన్ ఐడల్ గాయకులు హాజరు..

స్వరాభిషేకానికి ప్రత్యేకంగా తెలుగు ఇండియన్ ఐడల్ సింగర్స్ సౌజన్య, భాగవతులు, ప్రముఖ వయోలిన్ కళాకారిని అంబటిపూడి కామాక్షి, కీబోర్డు ప్లేయర్ సాయి, ఎలక్ట్రానిక్ ప్యాడ్ వాయిధ్యకారుడు సాయి హాజరయ్యారు. స్థానిక గాయకులు సురభి శ్రావణి, హారిక, సులోచన, బి.ఉమాశంకర్ పాడిన ఘంటసాల గీతాలు సంగీతాభిమానులకు కట్టిపడేశాయి. చిటపట చినుకులు పడుతూ ఉంటే.. నిన్ను వదిలి నేను పోలేనులే.. ఇది నిజములే.. రాజశేఖరా నీపై మోజు తీరలేదురా.. చిగురాకులలో చిలకమ్మ వంటి పాటలు సంగీత ప్రియుల పేక్షకుల చప్పట్లతో మారుమోగాయి.

రైతుకు వర్రీ



రేవళ్లపాలెం పొలాల్లో తడిచిన వరి చేను

శృంగవరపుకోట, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు తడిచిన ధాన్యం మొలకలు వచ్చేశాయి. వాటిని చూస్తున్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శృంగవరపుకోట మండలం రేళ్లపాలెం గ్రామానికి చెందిన రైతుల పొలాల్లో వరికంకిలో బుధవారం మొలకలు కనిపించాయి. వరి కంకులు తడి ఆరుతుందన్న అభిప్రాయంతో వాటిని పొలంలోనే తిరగవేసేందుకు ప్రయత్నించగా మొలకలు రావడం చూసి దిగాలు చెందారు. ఎంతో కష్టపడి పండించిన పంట పాడైనందుకు నిరాశ పడ్డారు.



ఎస్.కోట మండలం రేవళ్లపాలెంలో మొలకెత్తిన వరి కంకెలు



సవర లిపి బొమ్మలను వేస్తున్న గిరిజన యువత

భళా.. సవర హస్తకళ

● నేర్చుకునేందుకు ఆసక్తి చూపిస్తున్న గిరిజన యువత
● ఆ చిత్రాలకు మార్కెట్‌లో డిమాండ్ ● ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వం





చెక్కపై గుసాడ పండగ బొమ్మను వేసిన శిక్షకులు

సీతంపేట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన సవర హస్త కళపై గిరిజన యువత ఆసక్తి చూపిస్తోంది. మార్కెట్‌లో ఆ చిత్రాలకు మంచి డిమాండ్ ఉండడంతో సవర హస్త కళను నేర్చుకునేందుకు ఉవ్విళూరుతున్నారు. కూటమి ప్రభుత్వం కూడా వారిని ప్రోత్సహిస్తోంది. దీనిలో భాగంగా సీతంపేట పీఎంఆర్‌సీ కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గురు, శిష్య హస్త శిల్పి (జీఎస్‌హెచ్‌పీపీ)కార్యక్రమం ద్వారా 30 మంది నిరుద్యోగ ఆదివాసీ యువతీ, యువకులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణకు సీతంపేట ఐటీడీఏ పూర్తి సహకారం అందిస్తోంది. గిరిజన సవర సంస్కృతి, సంప్రదాయలు ఉట్టిపడేలా బొమ్మలు వేయడం, క్రాఫ్టలను తయారు చేయడం వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. తరగతులకు వచ్చే యువతీ, యువకులకు రోజుకు ఒక్కోక్కరికి రూ.300 వరకు ఇస్తారని శిక్షకుడు గౌరీష్ చెప్పారు.

అన్ని విధాలుగా ప్రోత్సాహం..

గిరిజన హస్త కళను నేర్చుకునేందుకు వస్తున్న గిరిజన యువతకు ఐటీడీఏ నుంచి పూర్తి సహకారం అందుతుంది. శిక్షణకు అవసరమైన కిట్లను ఇప్పటికే పంపిణీ చేశారు. శిక్షణ అనంతరం వీరికి సర్టిఫికెట్‌ను అందజేస్తారు. డెవలప్‌మెంట్ కమిషన్ ఆఫ్ హ్యాండి క్రాఫ్ట్ సౌజన్యంతో సీతంపేట ఏజెన్సీలో హస్త కళలపై మొదటి విడత 30 మందికి శిక్షణ తరగతులు ఇచ్చారు. రెండో విడత పీఎంఆర్‌సీ కేంద్రంలో నెల కిందట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి శిక్షణ తరగతులను ప్రారంభించారు. మరో నెల పాటు శిక్షణ కొనసాగనుంది.

సవర సంస్కృతి ఉట్టిపడేలా..

ఆదివాసీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల (సవర)ది ఓ ప్రత్యేక సంస్కృతి. వారి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, ఆహారపు అలవాట్లు, పండగలు అన్నింటిలోను వారిది ఓ ప్రత్యేకమైన జీవనసరళి. అలాంటి సంస్కృతిని ఇనుమడింపజేసేలా ఈ సవర హస్త కళలపై శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ తరగతులకు వచ్చే యువతీ, యువకులు సవర చిత్రాలను చక్కగా వేస్తూ అబ్బుర పరుస్తున్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, పండగలు, వారి అలవాట్లను చిత్రాలుగా మలచి ఔరా అనిపిస్తున్నారు. గుండ్రని చెక్కలపై ఆదివాసీలు చేసే పొలం పనులు, ఎద్దులతో దుక్కిలు దున్నడం, విత్తనాలు నాటడం, బాణాలు సంధించడం, చెట్టు నీడలో పిల్లలు ఉయ్యాల ఊగడం, వంటకాలు, వనదేవతలకు పూజలు, ధాన్యాన్ని భద్రపరచడం, గుసాడ (పండగ) వంటి సవర చిత్రాలను వేసి ప్రదర్శిస్తున్నారు.

ఎంతో ఉపయోగం..

నేను సవర చిత్ర హస్తకళను నేర్చుకుంటున్నాను. శిక్షణలో నేర్చుకున్న విద్యతో హ్యాండిక్రాఫ్ట్ బజారు ఏర్పాటు చేసుకుని ఆదాయం పొందవచ్చు. గిరిజన యువతను ఈ విధంగా ప్రోత్సహించడం ఎంతో ఆనందంగా ఉంది. శిక్షణతో పాటు రోజు వారీ ఆదాయం కూడా వస్తుంది.

-ఆరిక సోమేసు, బిల్లగూడ, సీతంపేట

ఉపాధి అవకాశాలు చూపించాలి..

నాకు హస్త కళలంటే ఎంతో ఇష్టం. అందుకే సవర హస్త కళ శిక్షణలో ఉత్సాహంగా పాల్గొంటున్నా. రెండు నెలల పాటు ఇచ్చే శిక్షణ మాకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఐటీడీఏ ఉపాధి అవకాశాలు చూపించాలి.

-తోయిక అనూష, సిరికొండ, సీతంపేట

అటవీ శాఖతో ఆదాయం పెంపునకు కృషి

గజపతినగరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అటవీ శాఖ ద్వారా ఆదాయాన్ని సమకూర్చడంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తానని ఏపీ అటవీ శాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు తెలిపారు. స్థానిక ప్రైవేటు కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్.పెద్దినాయుడు కుటుంబ సభ్యులను, తెలుగుదేశం పార్టీ నాయకులను బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూకలిప్టస్, కాఫీ తదితర పంటల సాగుతో ఆదాయ వనరులు సమకూరే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎర్రచందనం వల్ల రాష్ట్రానికి ఆదాయం సమకూరుతుందన్నారు. మాజీ సీఎం జగన్ రాష్ట్రాన్ని అని రంగాల్లో నిర్వీర్యం చేశారని ఆరోపించారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధి శాఖను తీసుకోవడం వల్ల గ్రామాలు ఇక నుంచి అభివృద్ధి బాటలో నడుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ జి.గోవింద, టీడీపీ నాయకులు కోళ్ల రాము, పి.వి.వి.గోపాలరాజు, శీరంరెడ్డి శారదనాయుడు, రాంకుమార్, చంద్రశేఖర్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నాయకులతో మాట్లాడుతున్న సుజయ్ కృష్ణ రంగారావు

న్యూస్ బాక్స్

రేపు జాబ్‌మేళా

శృంగవరపుకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 6న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేశవరావు తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారంతా ఆధార్ కార్డు, ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. వివరాలకు 79956 91295 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

7న ఎల్అండ్‌టీ చైర్మన్ రాక

రాజాం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన కంపెనీలలో ఒకటైన ఎల్అండ్‌టీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎస్.సుబ్రమణ్యన్ ఈనెల 7న రాజాం రానున్నారు. ఇక్కడి జి.ఎం.ఆర్. ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న కార్యక్రమంలో జి.ఎం.ఆర్. గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ గ్రంధి మలికార్జునరావు (జీఎంఆర్)తో కలిసి పాల్గొననున్నారని నిర్వాహకులు తెలిపారు.

రేపు కళా ఉత్సవ్

నెల్లిమర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):స్థానిక వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో ఈ నెల 6న జిల్లా స్థాయి కళాఉత్సవ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అంశాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. 9 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు వ్యక్తిగతంగా, లేదా ఐదుగురు సభ్యులుగా గానీ పాల్గొనవచ్చని తెలిపారు.

నేటి నుంచి విశాఖ- రాజాం బస్సు

రాజాం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజాం- విశాఖ ఆర్టీసీ బస్సును గురువారం నుంచి కొత్తగా ఏర్పాటు చేస్తున్నట్టు పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజరు పి.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యం ఉదయం 4.30 గంటలకు ఈ బస్సు రాజాంలో బయలుదేరుతుందని తెలిపారు.

హోం మంత్రిని కలిసిన గ్రీష్మాప్రసాద్

రాజాం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కావలి గ్రీష్మాప్రసాద్ గురువారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, హోం మంత్రి అనితను విజయవాడలో బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత, అభివృద్ధిపై చర్చించినట్లు గ్రీష్మ తెలిపారు.

గంటానకు గద్దర్ పురస్కారం

చీపురుపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయ ఉద్యమ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, మాల మహానాడు నాయకుడు గంటాన అప్పారావు గద్దర్ జాతీయ సేవా పురస్కారానికి ఎంపికైనట్టు బహుజన కళామండలి ప్రతినిధి ఎ. ఉదయ భాస్కర్ తెలిపారు. ఈ నెల 12న పి.గన్నవరంలో అయనకు పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారని తెలిపారు.

ఆయా తొలగింపు తగదు

గజపతినగరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రామన్నపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా విధులు నిర్వహించిన సౌజన్యను తొలగించడం తగదని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ గజపతినగరం ప్రాజెక్టు కార్యదర్శి పి.జ్యోతి డిమాండ్ చేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఆ గ్రామ సర్పంచ్ ఆయాపై రాజకీయ వేధింపులకు గురి చేసి విధుల నుంచి తొలగించేలా చేయడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎం.సుభాషిణి, సిటూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి, ము త్యాలమ్మ, సౌజన్య, మంగమ్మ పాల్గొన్నారు.

అప్రమత్తతే ప్రధానం

విజయనగరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో వ్యక్తిగత భద్రత, అప్రమత్తతే ప్రధానమని ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. స్థానిక పోలీస్ కార్యాలయంలో బుధవారం జిల్లాలోని ముఖ్యమైన వ్యక్తులకు, తీవ్రవాదులు, మావోయిస్టుల నుంచి ముప్పు ఉన్న వ్యక్తులకు భద్రత కల్పించే పోలీసు సిబ్బందికి పునశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రహదారి సదుపాయం కల్పించండి

శృంగవరపుకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుడిలోవకు రోడ్డు సదుపాయం కల్పించాలని పంచాయతీ అధికారులను కోరినట్టు జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు బుధవారం తెలిపారు. ఈ గ్రామానికి రోడ్డు లేక పోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రేగపుణ్యగిరి గ్రామానికి కూడా రోడ్డు వేయాలని కోరారు.

సీఐటీయూ ధర్నా

శృంగవరపుకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జామి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ మేరకు ఎంపీడీఓ అప్పలనాయుడుకు వినతిపత్రం అందించారు. సకాలంలో జీతాలు చెల్లించాలని నాయకులు సురేష్, మద్దిల రమణలు డిమాండ్ చేశారు.

ప్లాంట్ల వ్యర్థాలపై యువత ఆందోళన

రేగిడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సంకిలి ఈఐడీ ప్యారీ, దాని అనుబంధ పరిశ్రమల నుంచి కాలుష్యం, దేవుదళ రోడ్డుపై వెదజల్లుతున్న వ్యర్థాలతో ఎదురవుతున్న ఇబ్బందులపై పుర్లి, దేవుదళ గ్రామాల యువత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కొత్తగా నిర్మాణంచేసిన ప్లాంట్లతో సాగునీటి వనరులు, రోడ్లకు తీవ్ర నష్టం కలిగిస్తున్నట్టు ఆరోపించారు. స్థానిక ప్యారీ చక్కెర కర్మాగారానికి వచ్చిన చెరకు లారీలను బుధవారం పుర్లి, దేవుదళ గ్రామాల యువత అడ్డుకొని నిరసన తెలిపారు. అడ్డు తగిలిన సిబ్బందితో ఈ రెండు గ్రామాల యువత వాగ్వాదానికి దిగారు. షుగర్స్ వ్యర్థాలను విడిచి పెడుతుండడంతో రోడ్డు దెబ్బ తింటోందని ఆరోపించారు. మరోవైపు దుమ్ము, ధూళితో పాటు, వర్షాకాలంలో బైక్‌లు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని వాపోయారు. మరోవైపు ప్లాంట్ కలుషిత జలాలతో, సాగునీటి వనరులు, పంట పొలాలు పాడవుతున్నాయని ఆరోపించారు. కాలుష్య నియంత్రణ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. పోలీసులు జోక్యం చేసుకొని, షుగర్స్ యాజమాన్యం రోడ్డు బాగుచేస్తారని సర్దిచెప్పారు. దీంతో యువత ఆందోళన విరమించారు.


ఇరువర్గాలతో చర్చిస్తున్న పోలీసులు

సబ్‌స్టేషన్లను నిర్మించండి

శృంగవరపుకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు సహకరించాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమంది పృధ్వీతేజను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. బుధవారం ఆయనను మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే కలిశారు. సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందించారు.


సీఎండీకి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

కృష్ణాపురం రోడ్డును బాగుచేయరూ!

శృంగవరపుకోట మండలం కృష్ణాపురం గ్రామానికి వెళ్లే రోడ్డును బాగుచేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి గ్రేటర్ విశాఖపట్టణం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు విన్నవించారు. బుధవారం ఈమేరకు జీవీఎంసీ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. తాటిపూడి జలాశయం నుంచి విశాఖకు తాగునీటి పైపులైన్లలో ఈ రోడ్డు ఉంది. పది సంవత్సరాల క్రితం వేసిన తారు రోడ్డు పాడయింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్తులు తీసుకొచ్చారు. ఈ రోడ్డు బాగాలేనందున తాటిపూడి, మధుపాడ, ముషిడిపల్లి, వేములాపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. దీంతో జీ.వీఎంసీ కమిషనర్‌ను ఎమ్మెల్యే కలిసి, సమస్యను తెలియజేశారు.

పోలీసు కుటుంబానికి చేయూత

విజయనగరం క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మరణించిన పోలీసు ఉద్యోగి కుటుంబానికి ఎస్పీ వకుల్‌జిందాల్ చేతుల మీదుగా బుధవారం ఆర్థిక సాయం అందించారు. జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో కానిస్టేబుల్‌గా పని చేసే షేక్ బాబా అనారోగ్యంతో సెప్టెంబర్ 24న మరణించారు. ఆ కుటుంబాన్ని ఆదుకొనేందుకు పోలీసులు అందరూ కలిసి రూ.1,47,900 చెక్‌ను మృతుని భార్య షేక్ పర్వీన్‌నిషాకు ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

నాణ్యత లోపిస్తే చర్యలు

రాజాం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోగులకు సరఫరా చేసే ఆహార పదార్థాలలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని రాజాం సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కరణం హరిబాబు స్పష్టం చేశారు. బుధవారం ఉదయం వార్డుల పరిశీలన సందర్భంగా పలువురు రోగులు ఆహారంలో నాణ్యత కొరవడిందని ఆయనకు తెలిపారు. ప్రశ్నిస్తే తమపై తిరుగుబాటు చేస్తున్నారని సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే కాంట్రాక్టర్‌ను రప్పించి హెచ్చరించారు. ఆహార పదార్థాల రుచి, నాణ్యత మెరుగుపరచకపోతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఘంటసాల జయంతి

గరివిడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గరివిడిలో ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో సంస్థ వ్యవస్థాపకులు వాకాడ శ్రీను, అధ్యక్షులు యు.శ్రీను, ఎస్ఎంఎస్ ఫెర్రో ఎల్లాయిస్ డైరెక్టర్ వాకాడ గోపి, ఉప సర్పంచ్ బమ్మిడి కార్తీక్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలో బుధవారం రాత్రి పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఘంటసాల పాటలను గాయకులు వినిపించారు.

విద్యార్థులకు అభినందన

రాజాం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7న జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న మెగా పేరెంట్-టీచర్ సమావేశాలకు సంబంధించి పెనుబాక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు తయారుచేసిన ఆహ్వాన పత్రికలను సర్వశిక్ష అభియాన్ సి.ఎం.ఓ. వి.ఆదినారాయణ బుధవారం పరిశీలించారు. విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ కొండవలస మధుసూదనరావును అభినందించారు. కార్యక్రమంలో ఏపీఓ గోపీచంద్ పాల్గొన్నారు.

చార్జీలు రద్దు చేయాలి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీలను ప్రభుత్వం రద్దు చేయాలని విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. విజయనగరం అపార్ట్‌మెంట్స్ అండ్ కాలనీల అసోసియేషన్ కార్యదర్శి యు.ఎస్. రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.16 వేల కోట్ల విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై భారం వేశారని తెలిపారు. వీటిని రద్దు చేసేవరకు పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పొలూరి రమణమ్మ, ఆప్ జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు రమేష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి వి.రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారం వద్ద కార్మికుల దీక్షలు

చీపురుపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటరామ పౌల్ట్రీస్ వద్ద యాజమాన్యం తీరును నిరసిస్తూ కార్మికులు బుధవారం రిలే దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం ప్రతినిధులు గురునాయుడు, టి.ఈశ్వర రావు మాట్లాడుతూ ఈ ఏడాది జూన్‌లో కొత్తగా వేతన ఒప్పందం జరగవలసి ఉందన్నారు. ఈ నెల 3న విశాఖపట్నంలోని కార్మిక శాఖాధికారుల సమక్షంలో వేతనం పెంపుపై యాజమాన్యం మొండిగా వ్యవహరించిందన్నారు. రూ.250 కంటే ఎక్కువ తాము పెంచలేమని యాజమాన్యం చెప్పడంతో తాము రిలే దీక్షలు ప్రారంభించామని తెలిపారు. ఈ దీక్షలను సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంబల్ల గౌరినాయుడు, జె.విశ్వనాథరాజులు ప్రారంభించారు.


సంస్థ ఎదుట రిలే దీక్షలు చేపట్టిన కార్మికులు

నావికా దళానిది కీలక పాత్ర

విజయనగరం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శౌర్యానికి మారుపేరు భారత రక్షణ రంగమని, దీనిలో నావికా దళం కీలకపాత్ర పోషిస్తోందని కోరుకొండ సైనిక పాఠశాల పరిపాలన అధికారి, లెఫ్టినెంట్ సీడీఆర్ అభిలాష బాలచంద్రన్ అన్నారు. అక్కడి పీవీజీరాజు ఆడిటోరియంలో బుధవారం నావికాదళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణ రంగాల్లో విద్యార్థులు చేరి దేశ రక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు.

నెలాఖరులోగా పన్నులు చెల్లించండి

నెల్లిమర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని భవన యజమానులు ఆస్తిపన్ను, కుళాయి పన్ను, ఖాళీ స్థలాలపై పన్ను డిసెంబరు మాసాంతంలోగా చెల్లించాలని కమిషనర్ కె.అప్పలరాజు సూచించారు. జనవరి 1 తర్వాత 2 శాతం అపరాధ రుసుంతో చెల్లించాలని ఆయన తెలిపారు. నెల్లిమర్లలో ఆయన బుధవారం పర్యటించి భవన యజమానులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమాభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు


సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రాజాం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం రాజయ్యపేట సచివాలయాన్ని తనిఖీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉదయం 10 గంటలకు హాజరుకావాల్సి ఉండగా కొంతమంది సిబ్బంది సకాలంలో హాజరుకావడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. ఇకపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని... అవసరమైతే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయవలసి వస్తుందని హెచ్చరించారు. అనంతరం కంచరాంలో చేపడుతున్న మరుగుదొడ్ల సర్వేను ఆయన పరిశీలించారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్వీ వర్సిటీలో ప్రొఫెసర్ చెంగయ్య మత బోధనలు చేస్తున్నారని ఉద్దేశంతో దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు సోము రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ దేవీ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో చిరంజీవి, పీవీ రమణ, యేసు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హెచ్‌ఎంపై బాలుడి దాడి

రామభద్రపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జుమ్మువలస ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సువ్వాడ వెంకటప్పలనాయుడుపై ఓ బాలుడు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో కత్తితో తలపై దాడిచేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు..చదరడవలస గ్రామానికి చెందిన బాలుడు కొటశిర్లాం పాఠశాలలో ఏడో తరగతి చదివి బడిమానేశాడు. గతంలో హెచ్‌ఎం వద్ద పాఠశాలలో చదువుతున్న సమయంలో బాలుడ్ని మందలించాడు. ఆ కోపంతో దాడి పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. వెంకటప్పలనాయుడు తలకు మంకీ టోపీ ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గాయపడిన ఆయన్ను రామభద్రపురం ఆసుపత్రిలో చేర్పించగా వైద్యులు చికిత్స అనంతరం ఇంటికి పంపించారు. ఈమేరకు బుధవారం హెచ్‌ఎం, కుటుంబ సభ్యులు, ముచ్చర్ల వలస గ్రామస్థులు రామభద్రపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే మానసిక పరిస్థితి బాగోలేకపోవడంతోనే దాడిచేశాడని తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు.

నులకజోడులో వృద్ధురాలి ఆత్మహత్య

భామిని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నులకజోడు గ్రామానికి చెందిన పెద్దాడ ఆదిలక్ష్మి (81) బుధవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది.. పోలీసులు, స్థానికుల కథనం మేరకు... నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ఆదిలక్ష్మి భర్త పదేళ్ల కిందట చనిపోవడంతో కుమారుడి వద్ద ఉంటోంది. కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో గడ్డి మందు తాగి అపస్మారకస్థితిలోకి చేరుకుంది. వెంటనే భామిని పీహెచ్‌సీకి తరలించగా అక్కడ నుంచి సీతంపేట తరలిస్తున్న సమయంలో మృతి చెందింది. ఈ మేరకు ఏఎస్ఐ కాంతారావు కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చీపురుపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పత్తికాయవలసకు చెందిన రఘుమండ వాసు (54) రైలు ఢీకొని దుర్మరణం పాలయ్యాడు. చీపురుపల్లి రైల్వే స్టేషన్ వద్ద బుధవారం ఆయన పట్టాలు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

సీతంపేటలోని సెలూన్‌లో దొంగతనం

సీతంపేట రూరల్,డిసెంబర్ 4(ఆంధ్రజ్యోతి): సీతంపేట ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ సెలూన్‌లో మంగళవారం అర్ధరాత్రి ఇత్తడి ఐరన్ బాక్స్, చిల్లర నగదును దొంగిలించుకు పోయారు. దుకాణం యజమాని సంజీవరావు బుధవారం తెల్లవారి షాపు తెరిచేందుకు వచ్చి చూసే సరికి తాళం చెవి పగలగొట్టి ఉండడాన్ని గమనించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ వై.అమ్మన్నరావు బుధవారం దుకాణాన్ని పరిశీలించారు.

మహిళ అదృశ్యం

నెల్లిమర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నీలంరాజుపేట గ్రామానికి చెందిన జలుమూరు పెంటమ్మ (45) అనే మహిళ ఆరు రోజుల నుంచి కనిపించడం లేదని ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ చెప్పారు. ఆమె గత కొంతకాలంగా గ్రామస్థుల నుంచి అప్పులు చేసి... తిరిగి చెల్లించలేక వారి ఒత్తిళ్లకు భయపడి ఉందన్నారు. గత నెల 29న బ్యాంకుకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయిందని... ఇంత వరకు తిరిగి రాలేదని ఆ ఫిర్యాదులో భర్త పేర్కొన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జగనన్న కాలనీల్లో విజిలెన్స్ తనిఖీలు

బొండపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జగనన్న కాలనీలో లేఅవుట్‌లలో అవకతవకలను గుర్తిం చేందుకు బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ సిబ్బంది జె.పురుషోత్తమరావు, మండల స్థాయి హౌసింగ్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. మండలంలో 32 కాలనీలు నిర్మించారని వివరించారు. వీటిలో 885 ఇళ్లు మంజూర య్యాయని తెలిపారు. ఈ కేటాయింపుల్లో ఎటువంటి అవకతవకలు జరిగాయన్న విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్టు తెలి పారు. గృహ నిర్మాణ శాఖ లెక్కల ప్రకారం 885కి గానూ 428 గృహాలు ప్రారంభ మయ్యాయని తెలిపారు. మిగిలినవి ఎందుకు నిలిచిపోయాయనేది ఆరా తీస్తున్నట్టు అధికారులు చెప్పారు.


కనిమెరక లేఅవుట్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ సిబ్బంది

పెనుబాకలో వైద్య శిబిరం

రాజాం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెనుబాక గ్రామంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బొద్దాం పిహెచ్.సి. వైద్యాధికారి సిద్ధేశ్వరి ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామంలోని పెద్దవీధిలో వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో డయేరియా లేదని డా.సిద్ధేశ్వరి నిర్ధారించారు. పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామంలోని బోర్లలోని తాగునీటిని పరీక్షల కోసం సేకరించారు. దాదాపుగా గ్రామంలోని ప్రతి వీధిలోనూ పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా కనిపిస్తోంది. చెత్తనిల్వలు పేరుకుపోయాయి. ప్రధానంగా ఎస్సీ కాలనీ ప్రాంతంలో పరిస్థితి దారుణంగా మారింది.


వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

అక్రమ భవన నిర్మాణాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తున్నారంటూ ఈనెల 2న 'ఆ నిర్మాణాల సంగతేంటి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదేశాలతో వివిధ ప్రాంతాల్లో నిర్మించిన భవనాల్లోని కొన్ని భాగాలను తొలగించారు. మరో భవనంలో అనుమతులు లేకుండా పైఅంతస్తు వేయడంతో వాటికి అమర్చిన సెంట్రింగ్ పనులను సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా నిబంధనలను అతిక్రమించి భవన నిర్మాణాలు చేపడితే ఉపేక్షించబోమన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి

పాలకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలని పాలకొండ అగ్నిమాపక శాఖాధికారి జామి సర్వేశ్వరరావు తెలిపారు. బుధవారం మండలంలోని భాసూరు జడ్పీఉన్నతపాఠశాలలో విద్యార్థులకు అవగాహనకల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు భాస్కరరావు, హేమలత, ఆదిలక్ష్మి, సతీష్‌కుమార్, రామకృష్ణ, దాలినాయుడు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.5.17 లక్షలు

పాలకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):పాలకొండలోని కోటదుర్గమ్మ ఆలయంలోని హుండీలను బుధవారం లెక్కించారు. 47 రోజులకు రూ.5,17,506లు వచ్చినట్టు సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ, వీఆర్వో పాలవలస రమేష్, రికార్డు అసిస్టెంట్ వేమకోటి శ్రీనివాసశర్మ, జూనియర్ అసిస్టెంట్ లత పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్లు

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలో ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్లను పంచాయతీకార్యదర్శి గ్రామ సచివాలయ సిబ్బంది బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని షాపుల వద్దకు వెళ్లి నిర్వాహకులతో రిజిస్ట్రేషన్లు చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారికి బ్యాంకు నుంచి రుణాలు,ఆదాయపన్ను, మినహాయింపులు, పరిశ్రమల ఏర్పాటుకు లైసెన్స్‌లు మంజూరవుతాయని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల పాఠశాల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు సమస్యలను పరిష్కరించడానికి సీఎం, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట జరుగుతున్న దీక్షలకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమసంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, శ్రామిక మహిళా సంఘం నాయకులు వాకాడ ఇందిర, ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిల్లర్ల సమస్యలపై వినతి

గరుగుబిల్లి,డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):మన్యం జిల్లా పరిధిలోని రైస్‌మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలని జిల్లా రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు బూరాడ రామ్‌మోహనరావు కోరారు.ఈ మేరకు బుధవారం పార్వతీపురంలోని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్‌నజీర్ జిలానీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగాజిల్లాకు సంబంధించి రూ.30 కోట్లకుపైగా బకాయిలు రావాల్సి ఉందని, దీంతో మిల్లర్లు నష్టాలబారిన పడ్డారని తెలిపారు. ఖరీఫ్‌లో కొనుగోలుకు సంబంధించి నిబంధనలు సడలించాలని కోరారు. కార్యక్రమంలో జేసీ ఎస్ఎస్ శోభిత, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి పి.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, జిల్లా సంఘ ప్రతినిధులు ఎ.మధుసూదనరావు, రవికుమార్ పాల్గొన్నారు.

ఉద్యాన కోర్సులతో ఉజ్వల భవిష్యత్: డీన్

గరుగుబిల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన కోర్సులతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం ఉల్లిభద్రలో కళాశాలలో విద్యార్థుల ప్రవేశాన్ని పురస్కరించుకుని ప్రత్యేకకార్యక్రమాలు నిర్వహించారు.ఈసందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ కళాశాల ప్రారంభం నుంచి ఏడువిడతల్లో పలువురు కళాశాలల్లో ప్రవేశం పొందారన్నాని, ప్రస్తుతం ఎనిమిదో విడత కౌన్సెలింగ్‌లో పలువురు విద్యార్థులు కళాశాలలో ప్రవేశం పొందారని చెప్పారు. ఈసందర్భంగా కళాశాల విద్యార్థినులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

కురుపాం రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని మరిపల్లి, మర్రిగూడ గ్రామాల్లోని గిరిజన వృద్ధులకు ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో జీలకర్ర ఉమామహేశ్వరి దుప్పట్లు పంపిణీచేశారు. ఎస్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి షేక్‌గౌష్ విశాఖపట్నానికి చెందిన గుండెవైద్య నిపుణుడు ప్రసాద్‌లాల్ నుంచి దుప్పట్లు సేకరించారు.

కురుపాంలో నేషనల్ అచీవ్‌మెంట్ పరీక్ష

కురుపాం,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి):కురుపాం గురుకుల పాఠశాలలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధి సామర్థ్యాన్ని, అభివృద్ధి పరీక్షించేందుకే జాతీయ విద్యామిషన్ ఆధ్వర్యంలో నేషనల్ అచీవ్‌మెంట్ పరీక్షను బుధవారం నిర్వహించినట్లు ఎంఈవో ఎన్.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక, ఉన్నతపాఠశాలల్లో 3, 6, 9 తరగతి విద్యార్థుల సామర్థ్యం పరీక్షంచడానికి ఈ పరీక్ష ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతి పాల్గొన్నారు.

అటవీ భూములకు పట్టాలివ్వండి

సాలూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అటవీ భూములకు పట్టాలివ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం మండలాధ్యక్షుడు వంతల సుందరరావు, సీపీఎం నేత మర్రి శ్రీనివాసరావు కోరారు.ఈ మేరకు బుధవారం బొర్రపణుకువలస, జిల్లేడువలస గిరిజనులకు అటవీ భూపట్టాలివ్వాలని సాలూరు తహసీల్దార్ ఎన్వీరమణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూగతంలో సర్వేచేసి పట్టాలిస్తామని చెప్పి ఇప్పటికి ఇవ్వకపోవడం దారుణమన్నారు. పట్టాలు కోసం రెండేళ్లుగా పోరాడుతున్న అధికారులు స్పందించకపోవడం సరికాదని తెలిపారు. కార్యక్రమంలో గెమ్మెల నాగేశ్వరరావు,నర్సింగరావు పాల్గొన్నారు.

అపరాల సాగులో మెలకువలు పాటించాలి

మక్కువ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో అపరాల సాగులో మెలకువలు పాటించలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకుడు ఆర్. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండలంలోని తూరుమామిడిలో పొలం పిలుస్తోంది కార్య క్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో ఏవో బొత్స శ్రీనివాసరావు, ఎంఈవో దివ్య పాల్గొన్నారు.

● బలిజిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వరి మాగాణిలో రైతులు సాగుచేస్తున్న అపరాల పంటకు చిత్తపురుగు ఉధృతంగా ఆశిస్తోందని ఏవో ఎం.శ్రావణ్ కుమార్ తెలిపారు. మిత్తివలస, తుమరాడల్లో పొలం పిలుస్తోంది కార్యకమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్త నివారణ చర్యలను రైతులకు వివరించారు.

గుమ్మిడిగెడ్డ మినీ రిజర్వాయర్ పూర్తిచేయాలి

కురుపాం,డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గుమ్మిడిగెడ్డ మినీ రిజర్వాయర్ పూర్తిచేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ కోరారు. విజయవాడలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిశారు.ఈ సందర్భంగా వీరేష్ చంద్రదేవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని వట్టిగెడ్డ, గుమ్మిడిగెడ్డ మినీ రిజర్వాయర్ పూర్తిచేస్తే కొన్నివేల ఎకరాలకు సాగునీరందుతుందని తెలిజేసినట్లు తెలిపారు. విద్యా, వైద్యం, తాగునీరు, రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించడంపై దృష్టిసారించాలి



రామభద్రపురం:ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

రామభద్రపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్ కోరారు. ఈ మేరకు వివిధ సమ స్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవో తిరుమల ప్రసాద్‌కు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో విద్యాశాఖాధికారులు అసందర్భ నిర్ణయాల వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు దుర్కొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సుధాకరరావు, శంకరరావు, జ్యోతి, శశిభూషణరావు, వెంకటరావు, త్రినాథ, చంటి, రామకృష్ణ, రాజశేఖర్, కృష్ణమూర్తి, అప్పారావు పాల్గొన్నారు.

●బొబ్బిలి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):విద్యాశాఖ అధికారుల అసంబద్ధ నిర్ణయాలను రద్దుచేయాలని యూటీఎఫ్‌జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం బొబ్బిలిలో ఎంఈవో గొట్టాపు వాసుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఒత్తిడిలేని వాతావరణంలో ఉపాధ్యాయులు స్వేచ్ఛగా పనిచేసే విధంగా అధికారుల నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కేశవరావు, బొబ్బిలి గౌరవాధ్యక్షులు రమేష్, అధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు సుధాకర్, కృష్ణదాస్, స్వామినాయుడు పాల్గొన్నారు.



నిలిచిన అంగన్‌వాడీ కేంద్ర భవనం నిర్మాణం

పర్యవేక్షణ లేక.. పనులు పూర్తి కాక

● ఇదీ పిరిడిలోని అంగన్‌వాడీ కేంద్ర భవనం పరిస్థితి

బొబ్బిలి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిరిడిలో అంగన్‌వాడీ కేంద్రం భవనం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.ప్రధానంగా పర్యవేక్షణ లేకపోవడంతో పనులు పూర్తికాలేదు. టీడీపీహయాంలో ఉపాధిహామీ పథకం నిధులు రూ.7.5 లక్షలతో గ్రామంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరయ్యాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. భవననిర్మాణం పూర్తిచేయాలని పలుసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా భవన నిర్మాణం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో నిర్మాణంపూర్తి చేయడానికి చర్యలు చేపడతామని బొబ్బిలి డివిజన్ ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి తెలిపారు.

భూ సమస్యను పరిష్కరించాలి: మంత్రి సంధ్యారాణి



మంత్రికి భూసమస్యపై వినతిపత్రం అందజేస్తున్న మోసూరు రైతులు

సాలూరు,డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): భూసమస్యను పరిష్కరించాలని ఉన్నతాధికారులకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. తమకు ప్రభుత్వం ఇచ్చిన భూములను ఇప్పించాలని పాచిపెంట మండలంలోని మోసూరుకు చెందిన రైతులు పిట్టగవరయ్య, బొట్ట వెంకటరమణ, లింగాల రాజేశ్వరీ, నక్కాన గౌరమ్మకొండ్రు అప్పమ్మ, లక్షితోపాటు పలువురు రైతులు బుధవారం సాలూరులో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం 2001లో 50 మంది రైతులకు సర్వేనెంబరు 253 (పీ)లో 850 ఎకరాల వరకు డీపట్టా భూమి ఉంటే అందులో రైతులకు భూపట్టాలు పంపిణీచేసిందని తెలిపారు. ఇందులో సుమారు 50ఎకరాలు వరకు తమ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్వాధీనంలో ఉందని చెప్పారు. ప్రభుత్వం తమ భూమిని రీసర్వేచేసి తమ భూములకు తమకు ఇవ్వాలని కోరారు.

● విశ్వబ్రాహ్మణులను ఆర్థికంగాఆదుకోవాలని, ఆదరణతోపాటు మరిన్ని పథకాలను అమలు చేయాలని ఆ సంఘం నాయకులు పట్నాల ఈశ్వరరావు, భాస్కరరావు కోరారు. సాలూరులో విశ్వబ్రాహ్మణులు ఆమెకు కలుసుకుని సమస్యలను వివరించారు.

● ఏజెన్సీలోని సమస్యలు పరిష్కరించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ, జిల్లా అధ్యక్షుడు ఊయక ముత్యాలు, వీడిక అసిరి,మర్రి చెంచు కోరారు. మంత్రి నివాసంలో పలువురు గిరిజనులతో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 1981లో పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 170,సీతంపేట ఐటీడీఏపరిధిలో 241 గ్రామాలను షెడ్యూల్డ్ గ్రామాలుగా గుర్తించాలని పార్లమెంట్ స్థాయి కమిటీకి నివేదిక సమర్పించినా గ్రామాలుగా గుర్తించలేదని తెలిపారు.మక్కువ మండలం దుగ్గేరులో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని కోరారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే

పాలకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. మండలంలోని తంపటాపల్లిలో ఉపాధి హామీ నిధులతో రోడ్డు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, జాడ శ్రీధర్, కిమిడి కాశీన్నాయుడు, రౌతు దామోదరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు: డీఐజీ



పోలీసులకు వైద్యపరీక్షల రిపోర్టు అందజేస్తున్న డీఐజీ గోపినాథ్ జెట్టి, ఎమ్మెల్యే విజయచంద్ర

గరుగుబిల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు తప్పవని విశాఖరేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి హెచ్చరించారు. బుధవారం గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పీ ఎస్వీ మాధవ రెడ్డి, పాలకొండ ఎస్‌డీపీ ఎం. రాంబాబు,సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్ఐ పి.రమేష్‌నాయుడు, పి.రాంబాబు పాల్గొన్నారు.

●జియ్యమ్మవలస, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి పిలుపునిచ్చారు. చినమేరంగి సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. తొలుత స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం జరిగిన సంకల్పం సభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి, పాలకొండడివిజన్ డీఎస్పీ ఎం.రాంబాబు,చినమేరంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టీవీ తిరుపతిరావు, ఎస్ఐ పి.అనీష్ పాల్గొన్నారు.

●బెలగాం/పార్వతీపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోలీసుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి ఎమ్మెల్యే విజయచంద్ర సొంత నిధులతో వైద్య పరీక్షలు చేయించడం అభినందనీయమని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి తెలిపారు. బుధవారం పార్వతీపురంలో ఎస్పీ అతిథిగృహంలో పోలీస్‌ల వైద్యపరీక్షల రిపోర్టులను పోలీస్ సిబ్బందికి ఎమ్మెల్యేతో కలిసి డీఐజీ అందించారు. పోలీసుల అమరవీరుల దినోత్సవాలు పురస్కరించుకుని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తన సొంతనిధులతో సుమారు 500 మందికి వైద్య పరీక్షలు చేయించారు. వాటికి సంబంధించిన రిపోర్టులను డీఐజీ సమక్షంలో పోలీసులకు అందించారు.కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి, అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్, పార్వతీపురం ఏఎస్పీ అంకితా సురాన్ పాల్గొన్నారు.

రక్షణ రంగంలో ఉద్యోగ అవకాశాలపై అవగాహన

పార్వతీపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆధ్వర్యంలో యువతకు అగ్నిపథ్‌లో ఉద్యోగాలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై 16 సంవత్సరాలు నుంచి 21 సంవత్సరాలు మధ్య వయస్సుగల యువత సదస్సుకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఈనెల ఆరోతేదీన సీతంపేట ఐటీడీఏ ఆడిటోరియంలో, 7న పార్వతీపురం ప్రభుత్వజూనియర్ కళాశాల ఆడిటోరియంలో, 8నసాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు.

సంపద తయారీ కేంద్రాలను పూర్తి చేయండి

వీరఘట్టం,డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):చెత్తనుంచి సంపద తయారీకేంద్రాల పనులను పూర్తి చేయాలని ఎంపీడీవో వెంకటరమణ కోరారు. బుధవారం వీరఘట్టంలో క్షేత్ర, సాంకేతిక సహాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటికి వంద రోజులు పని కల్పించాలని, పల్లె పండుగ పనులను పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో ఏపీవో సత్యంనాయుడు పాల్గొన్నారు.

ఎకో టూరిజం అభివృద్ధి

● ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావు

బొబ్బిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో ఎకో టూరిజం అభివృద్ధి చేస్తామని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) చైర్మన్ ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావు తెలిపారు. ఎర్రచందనం విక్రయించేందుకు తమ కార్పొరేషన్ ఏజెంట్‌గా వ్యవహరిస్తుందని చెప్పారు. బుధవారం బొబ్బిలికోటలో విలేకరులతో మాట్లాడుతూ ఎర్రచందనం ధర అంతర్జాతీయ మార్కెట్‌లో కాస్త మందకొడిగా ఉందని, ధర పుంజుకున్న వెంటనే నిల్వలను విక్రయిస్తామని తెలిపారు.ఐదేళ్ల జగన్‌పాలనలో అరాచకాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడంతో వాటిని చక్కదిద్దే పనిలో చంద్రబాబు నిమగ్నమయ్యారన్నారు. కాకినాడ పోర్టును స్మగ్లింగ్‌కు అడ్డాగా మార్చారని ఆరోపించారు.సమావేశంలో ఎమ్మెల్యే బేబీనాయన, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, మునిసిపల్ ఫ్లోర్ లీడరు గెంబలి శ్రీనివాసరావు, కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టరు కొల్లి అప్పలనాయుడు, కర్రోతు తిరుపతిరావు, మడక తిరుపతినాయుడు, చింతల రామకృష్ణ పాల్గొన్నారు.

సుజయ్‌కృష్ణరంగారావుకు ఘన స్వాగతం

ఏపీఎఫ్‌డీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి తొలిసారి బొబ్బిలి వచ్చిన ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావుకు పార్టీ శ్రేణులు, అభిమానులు, నాయకులు ఘనస్వాగతం పలికారు స్థానిక కోటలో అభినందించారు. ఆయన వెంట ఎమ్మెల్యే బేబీనాయన, రామ్‌నాయన, బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాల నాయకులు ఉన్నారు.



బొబ్బిలి: సుజయ్‌కృష్ణరంగారావుకు స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

●బొబ్బిలి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి కోటలో బొబ్బిలి మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సుజయ్ కృష్ణ రంగారావును కలిశారు. కార్యక్రమంలో కార్యదర్శి గోవిందనాయుడు, రెడ్డి రామకృష్ణ, సీహెచ్ డేవిడ్ పాల్గొన్నారు.



పాలకొండ: ర్యాలీ నిర్వహిస్తున్న ధార్మిక సంఘాల ప్రతినిధులు



బొబ్బిలి: ర్యాలీ నిర్వహిస్తున్న హిందూసంఘాల ప్రతినిధులు

హిందువులపై దాడికి నిరసన

బొబ్బిలి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి)బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం బొబ్బిలిలో హిందూ సం ఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా హిందూ సంఘాల నాయకులు పెంట స్వామినాయుడు, పువ్వల శ్రీనివాసరావు, కొల్లూరు జగన్నాథరావు మాట్లాడుతూ హైందవ జాతిపై అక్కసుతో అనేక మంది ముష్కరులు ఇష్టారాజ్యంగా హింసకు దిగుతున్నారని ఆరోపించారు.అనంతరం హెచ్‌డీటీకి వినతిపత్రం అంద జేశారు. కార్యక్రమంలో డాక్టర్ రావాడ సత్యనారా యణ, చెలికాని కేశవ, గెంబలి శ్రీనివాసరావు,సుంకరి సాయిరమేష్, బీసపుపార్వతి, అల్లు స్వామి నాయుడు, అనిల్ పాల్గొన్నారు.

●పాలకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ధార్మిక సంఘాలు ఆధ్వర్యంలో ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయ కులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో మానవహక్కుల ఉల్లంఘన నిలిపివే యాలని, దేవాలయలపై దాడులు, హిందువులపై మారణహోమం ఆపాలని కోరారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సాహిని ఉమామహేశ్వరరా వు, దాశిరెడ్డి యోగేశ్వరరావు, గుడ్ల రామకృష్ణ, జగ్గారావు, భాస్కరనాయుడు, పద్మలత పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయాలి

బొబ్బిలిరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. బుధవారం బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం జరిగింది. ఈ సంద ర్భంగా గ్రామాల వారీగా గుర్తించిన పనులు, జరుగుతున్న అభివృద్ధిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్య క్రమంలో ఏపీవో లక్ష్మీపతిరాజు పాల్గొన్నారు

గంజాయి రవాణాపై నిఘా పెట్టాలి

రామభద్రపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో మహిళా పోలీసులు బాధ్యతగా పనిచేయాలని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాజరుగుతున్న దృష్ట్యా వాటిపై నిఘాఏర్పాటుచేయాలన్నారు. సమావేశంలో ఎస్ఐ వెలమలప్రసాద్ పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి

బలిజిపేట, డిసెంబరు 4(ఆంధ్ర జ్యోతి): మండలంలోని పెదపెంకిలో బస్టాండ్ ఆవరణలో నేతాజీ గ్రంథాలయం వ్యవస్థాపకులు సంజీవనాయుడు ఆధ్వర్యంలో బుధవారం అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి పురస్కరించుకుని చి త్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్య క్రమంలో కోట గౌరీనాథ్, జి.శ్రావణ్, పి.పరశురం, మురళి పాల్గొన్నారు.



ఘంటశాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మహిళలకు కుట్టుమిషన్ల వితరణ

బొబ్బిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని అభిమాని ఫౌండేషన్ కార్యాలయంలో ఆ సంస్థ చైర్మన్ రెడ్డి రాజగోపాలనాయుడు అధ్యక్షతన ప్రవాసాంధ్రులు సమకూర్చిన మూడు కుట్టుమిషన్లను మన బొబ్బిలి సేవా సంఘం అధ్యక్షుడు మింది శ్రీనివాస్ బుధవారం మహిళలకు అందజేశారు. అనంతరం అభిమాని సంస్థ ఆధ్వర్యంలో పేదలకు వస్త్ర, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కాజా వేణు గోపాలరావు, గేదెల చంద్రినాయుడు, గోనా చంద్రశేఖర్, రేవళ్ల కిరణ్‌కుమార్, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో ఆరోగ్యం

రేగిడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఫిజియోథెరపీతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని డాక్టర్ ఎం.రమాచంద్రిక పేర్కొన్నారు. రేగిడి భవిత కేంద్రంలో బుధవారం దివ్యాంగులకు ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వరప్రసాదరావు, ఉపాధ్యాయులు మహేశ్వరి, రాజేష్, కేర్‌టేకర్ అనురాధ పాల్గొన్నారు.

నాణ్యమైన బోధనతో మంచి ఫలితాలు

రేగిడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమశిక్షణతో నాణ్యమైన బోధన అందించాలని... అప్పుడే మంచి ఫలితాలు వస్తాయని ఎంఈఓ వరప్రసాదరావు సూచించారు. దేవుదళ కేజీబీవీలో బుధవారం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై నిర్వహించిన పరీక్షను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మి తదితరులు తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

రేగిడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉణుకూరు మాజీ సర్పంచ్ తెంటు కృష్ణమూర్తి నాయుడు (52) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. పొలంలో పని చేస్తుండగా ఛాతి నొప్పి రావడంతో అస్వస్థతకు లోనయ్యారు. కుటుంబీకులు ఆయనను రాజాం ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఆయనకు భార్య యశోదమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఖండ్యాంలో వైద్యపరీక్షలు

రేగిడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖండ్యాం హైస్కూల్‌లో స్థానిక ఆయుర్వేద డిస్పెన్సరీ ఆధ్వర్యంలో బుధవారం ఉపాధ్యాయులక వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్, హెచ్ఎం నాగభూషణదొర పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడులు

రాజాం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):అయ్యప్ప స్వాముల మండలదీక్ష పూర్తయిన సందర్భంగా పట్టణంలోని శాస్త్రాసమాజంలో బుధవారం ఇరుముడి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాజం పీఠాధిపతి ఉమాపతిశేషు గురుస్వామి, చెన్నైకి చెందిన వైద్యనాథం తదితరులు పాల్గొన్నారు. మొత్తం 85 మంది భక్తులు ఇరుముడులు ధరించారు.

హరిత రాయబారుల సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో ఇంటింటికి చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు ఏర్పాటులో కీలకంగా వ్యవహరిస్తున్న హరితరాయబారుల (గ్రీన్‌అంబాసిడర్లు) సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈమేరకు విజయ నగరం మండల గ్రీన్‌అంబాసిడర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు బుధవారం విన తిపత్రాన్నిఅందజేశారు. హరితరాయబారుల బకాయిలు చెల్లించాలని, 680 జీవో ప్రకారం రూ. 10 వేలు గౌరవవేతనంఇవ్వాలని కోరారు. మరణించిన కార్మికుల పిల్లలకు ఉపాధి కల్పించాలని, రక్షణపరికరాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

గుర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఆదిలక్ష్మి తెలిపారు. సభలకు రెవెన్యూ సిబ్బందితోపాటు ప్రజాప్రతినిధులుహాజరవుతారని పేర్కొన్నారు.

●శృంగవరపుకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 6 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించననున్నట్టు తహసీల్దార్ ఎం.అరుణ కుమారి తెలిపారు. భూ స సమస్యలను పరిష్కరిస్తామన్నారు. జామి మండలంలోనూ శుక్రవారం నుంచి జనవరి 5 వరకు సదస్సులు నిర్వహించను న్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

విజయనగరం క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైం సీఐ లంక అప్పలనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాలలు సోషల్ మీడియా, సైబర్ నేరాలపై అవగాహనసదస్సు నిర్వహిం చాయి.

నేడు విభిన్నప్రతిభావంతుల క్రీడలు

పార్వతీపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా స్థాయిలో విభిన్న ప్రతిభావంతులకు క్రీడలు గురువారం నిర్వహించనున్నట్లు ఆ శాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత తెలిపారు.ఈనెల మూడో తేదీన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో ఉన్న విభిన్న ప్రతిభావంతులకు కేటగిరీలవారీగా ఆటలపోటీ లు జిల్లాక్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు.